సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 16 । జూలై । 2025



మృత్యువులోనూ..

రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలు చనిపోయారు. కామేశ్వరిపేటలో ఘటన జరిగింది.

- 8లో

వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర ఎస్టీ విభాగం సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ విభాగం కమిటీలో సంయుక్త కార్యదర్శిగా ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన పెయ్యల లక్ష్మణరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పార్టీ అధ్యక్షుడు వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమిస్తూ మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

పోలీసుల అదుపులో 11 మంది

శ్రీకాకుళం క్రైమ్‌ : జిల్లాలో తీవ్ర సంచలనం కలిగించిన ఫరీదుపేట హత్య కేసు దర్యాప్తు ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. వైఎస్సార్‌ సీపీ కార్యకర్త సత్తారు గోపి హత్యకు కారణంగా భావిస్తూ 12 మందిని ఎఫ్‌ఐఆర్‌లో చేర్చిన పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించనున్నట్లు సమాచారం. ఎచ్చెర్ల ఎస్‌హెచ్‌ఓపై ఉన్నతాధికారులకు నివేదిక అందినట్లు భోగట్టా.

న్యూస్‌రీల్‌

నవంబరు 9న శ్రీముఖలింగంలో బాలియాత్ర

జలుమూరు: ఈ ఏడాది కార్తీక పౌర్ణమి అనంతరం నవంబరు 9న శ్రీముఖలింగంలో బాలియాత్ర నిర్వహించేందుకు నిర్ణయించామని కార్య నిర్వాహక కమిటీ సభ్యుడు డాక్టర్‌ దువ్వాడ జీవితేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఏడాది శ్రీముఖలింగంలో ప్రారంభమైన ఈ యాత్ర ఈ ఏడాది పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ యాత్రను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ బాలి యాత్ర గురించి చైనా యాత్రికులు హుయాయన్‌త్సాంగ్‌ ఓ గ్రంథంలో రాశారని, అలాగే బాలియాత్ర గురించి సంజీవ్‌ సన్యాల్‌ రాసిన ఓషన్‌ ఆఫ్‌ చర్చ్‌ అనే పుస్తకంలోనూ ప్రస్తావించారని పేర్కొన్నారు.

'సమస్యలు ఉంటే చెప్పండి'



విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ డీవీజీ శంకరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: విద్యార్థులు బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర గిరిజన కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ డీవీజీ శంకరరావు తెలిపారు. ఆయన మంగళవారం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంగ్లిష్‌ పదాలపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. అందరూ బాగా చదువుకోవాలని, తాను బాగా చదువుకొని డాక్టర్‌, ఎంపీ అయ్యానని విద్యార్థులకు చెప్పారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ 3 నుంచి 10 వరకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా మిత్ర కిట్లు అందించామన్నారు. వానాకాలంలో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని హెచ్‌ఎం చెప్పారు.

వైఎస్సార్‌ సీపీ కార్యకర్తపై దాడి



దాడికి గురైన కొవ్వూరు సుబ్బారావును పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో మంగళవారం వైఎస్సార్‌ సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. మున్సిపాలిటీలోని 7వ వార్డు చినబడాం గ్రామంలో మంగళవారం కొత్తమ్మ తల్లి మందిరం వద్ద చల్లదనం సంబరాలు జరిగాయి. ఈ ఉత్సవానికి వైఎస్సార్‌ సీపీ కార్యకర్త కొవ్వూరు సుబ్బారావు వెళ్లగా అక్కడ టీడీపీ వర్గానికి చెందిన అవినాష్‌, చంద్రమౌళి, సంతోష్‌, రవి కలిసి దాడి చేశారు. సుబ్బారావు పలాస ప్రభుత్వాస్పత్రిలో చేరి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అమ్మో ఎండ



వానాకాలం మొదలైనా వేడి దాడి మాత్రం తప్పడం లేదు. మంగళవారం తీవ్రమైన ఎండకు ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పనులపై బయటకు వెళ్లిన వారు చెమటలు కక్కారు. ఫుట్‌పాత్‌ వ్యాపారులైతే ఎండ ధాటికి అల్లాడిపోయారు. జిల్లా కేంద్రంలో కనిపించిన దృశ్యాలివి..

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, శ్రీకాకుళం







ఎరువు.. కరువు

- ఆర్‌ఎస్‌కేల్లో ఎరువుల నిల్వ లేక ఇక్కట్లు
- విత్తనం, ఎరువులు, పురుగు మందులు ఒకే చోట కొనుగోలు
- పట్టించుకోని వ్యవసాయశాఖ మంత్రి అధికారులు
- ఎరువుల కోసం క్యూలు కడుతున్న రైతులు



శ్రీకాకుళం (పీఎన్‌ కాలనీ):

ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమై చాలా రోజులవుతోంది. అదును, పదును చూసుకుని రైతులు దుక్కులు పెడుతున్నారు. ఏటా ఈ సమయానికి వారికి రైతు భరోసా డబ్బు అందేది. పెట్టుబడికి అంత ఇబ్బంది ఉండేది కాదు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాది అసలు సాయమే చేయలేదు. ఈ ఏడాది తేదీలు మార్చుకుంటూ పోతున్నారు తప్ప అన్నదాత సుఖీభవ అనలేదు. దీనికి తోడు ఈ సమయానికే రైతులకు అందుబాటులో ఉంచాల్సిన విత్తనాలు, ఎరువులను ఇంకా ఇంకా అందించలేదు. వ్యవసాయ శాఖ మంత్రి ఉన్న జిల్లాలో పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఇంకెంత దారుణంగా ఉందోనని రైతులు అనుకుంటున్నారు.

నిరంతరం రైతు ముంగిటకే సేవలందించే వ్యవసాయ సహాయకులను కుదించేసి, రైతు భరోసా కేంద్రాలు తగ్గించేసి రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారు. ఎరువుల్ని తీసుకొచ్చి కూటమి నేతల ఇళ్లల్లో పంపిణీ చేయడం, తమకు కావాల్సినంత దాచుకొని మిగిలిన ఎరువులు నచ్చినవారికి అందించడం అన్యాయమని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిష్పక్షపాతంగా అందరికీ కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందించేవారు. కూటమి పాలనలో అందుకు విరుద్ధంగా జరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలోవ్యాప్తంగా 556 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వ్యవసాయ సహాయకులు 533 మంది ఉండేవారు. ఇప్పుడు 441 మందికి తగ్గిపోయారు. జిల్లాలో ఈ-పాస్‌ మిషన్లతో ఇబ్బంది పడుతున్నారు.

లెక్కలు అలా.. పరిస్థితి ఇలా..

ప్రైవేటు వ్యాపారులు, సొసైటీలు, ఆర్‌ఎస్‌కేలు వద్ద నిల్వలు అన్ని రకాల కలిపి జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో 13355.9 మెట్రిక్‌ టన్నులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జిల్లాలో ఎరువులు ఉన్నాయనే అధికారులు చెబుతున్నారు. కానీ ఎక్కడా రైతులకు సక్రమంగా అవి అందడం లేదు. గంటల కొద్దీ క్యూలు, వ్యయప్రయాసలు తప్పడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లాలో అత్యధికంగా అవసరం ఉన్న నియోజకవర్గాల్లో ఎరువులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఎచ్చెర్ల నియోజకవర్గం జి.సిగడాం వంటి ప్రాంతాల్లో, టెక్కలి, పాతపట్నం, శ్రీకాకుళం, నియోజకవర్గాలో రైతులకు ముందస్తుగా ఎరువులు అవసరం ఉన్నప్పటికీ ఇప్పటికీ ఎక్కడా సరఫరా లేదు.

అదనం ఎందుకో..?

జలుమూరు: జిల్లాలో యూరియా కృత్రిమ కొరత నడుస్తోంది. యూరియా మొదలు కాంప్లెక్స్‌ ఎరువులు తీసుకోవాలంటే చాలు రైతులకు ఆయా వ్యాపారులు వేప పిండి, సీఎంఎమ్‌ పౌడర్‌(సంమ్‌ ఎరువులు), నానో యూరియా, డీఏపీ తదితరవి అంటగడుతున్నారు. రెండు బస్తాలు యూరియా కావాలంటే రూ.720 తోపాటు అదనంగా కనీసం రూ. 600 వేపపిండి, రసాయనిక ఎరువులు, నానో యూరియా, డీఏపీ తీసుకోవాలని ప్రైవేటు వ్యాపారులు చెబుతున్నారు. ఈ విధానం రైతులు పాలిట శాపంలా మారింది. ఇదేమి అన్యాయం అని రైతులు అడుగుతుంటే డీలర్లే తమకు అంటగడుతున్నారని వ్యాపారులంటున్నారు. రూ.లక్ష యూరియా కొనుగోలు చేస్తే రూ. రెండు లక్షలు విలువ గల రసాయనిక ఎరువులు, పౌడర్లు జత చేసి ఇస్తున్నారని ఆయా వ్యాపారులు చెబుతున్నారు.

కొత్తూరు, ఎల్‌ఎన్‌ పేట, హిరమండలం, సరుబుజ్జిలి, సారవకోట, జలుమూరు, కోటబొమ్మాళి తదితర మండలాల్లో మొదటి ఎరువు వేసేందుకు సిద్ధపడుతున్నారు. దీని కోసం రైతులు ఇప్పటి నుంచి ఆయా ఎరువులు నిల్వ చేసుకుంటున్నారు. దీని దృష్టిలో పెట్టుకొని ఆయా వ్యాపారులు రైతులు నుంచి అధిక మొత్తాలకు అమ్మకాలు చేస్తున్నారు. కృత్రిమ కొరత కూడా కనిపిస్తోంది.

ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో ఎరువుల నిల్వలు

యూరియా	4789.933 మెట్రిక్‌ టన్నులు
డీఏపీ	5101.98 మెట్రిక్‌ టన్నులు
ఎంఓపీ	700 మెట్రిక్‌ టన్నులు
ఎన్‌పీకేఎస్‌	2014.5 మెట్రిక్‌ టన్నులు
ఎస్‌ఎస్‌పీ	747.625 మెట్రిక్‌ టన్నులు



జి.సిగడాంలో ఎరువుల కోసం క్యూ (ఫైల్‌)

ఇతర ఎరువులు ఎందుకు..?

యూరియా కావాలంటే ఇతర ఎరువులు అంటకట్టడం అన్యాయం. ఇప్పటికే ధర ఎక్కువ.. ఆపైగా ఇలా వేప పిండి, రసాయన ఎరువులు అధిక ధరలతో అక్రమ వసూళ్లు చేస్తున్నారు. ఇంతకు ముందు ఈ పరిస్థితి లేదు.

– మామిడి అప్పన్న, రైతు, అబ్బాయిపేట

ఎరువులు అందిస్తున్నాం



జిల్లాలో రైతులకు కావాల్సిన ఎరువులు అందిస్తున్నాం. ఎక్కడ అందడం లేదని మా దృష్టికి వచ్చినా వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. ఈ-పాస్‌ మిషన్ల సమస్య ఉంది. సాంకేతిక సమస్యను పరిష్కరించి రైతులకు కావాల్సిన ఎరువులు సకాలంలో అందిస్తాం.

– ఆర్‌.త్రినాథ స్వామి, జిల్లా వ్యవసాయాధికారి



జి.సిగడాంలో ఎరువుల కోసం చెప్పులు పెట్టిన రైతులు(ఫైల్‌)

పేదరిక నిర్మూలనకు పీ-4: కలెక్టర్‌



మాట్లాడుతున్న కలెక్టర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పి-4 విధానాన్ని గ్రామ, వార్డు స్థాయిల్లో సమర్థంగా అమలు చేయాలని కలెక్టర్‌ స్వప్నిల్‌ దినకర్‌ పుండ్కర్‌ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరుకు బంగారు కుటుంబాల తుది జాబితాను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ హాస్టళ్లు, ఆస్పత్రులు, బస్టాండ్లలో పారిశుద్ధ్య నిర్వహణపై పర్యవేక్షణ తప్పనిసరి అని చెప్పారు. అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలపై ఆరా తీసిన కలెక్టర్‌ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జాయింట్‌ కలెక్టర్‌ ఫర్మాన్‌ అహ్మద్‌ ఖాన్‌, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు బి.పద్మావతి, జయదేవి, వివిధ శాఖల అధికారులు, మండల తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

కొడితే కొట్టాలిలా..

- ఆంధ్రా ప్రీమియర్‌ లీగ్‌(ఏపీఎల్‌) మెగా టోర్నీకి ముగిసిన వేలం
- జిల్లా నుంచి తొమ్మిది మంది క్రికెటర్లకు చాన్స్‌
- రికార్డు స్థాయిలో రూ.9.25 లక్షలకు అమ్ముడైన ప్రసాద్‌
- త్రిపురాన విజయ్‌కు రూ.7.55లక్షలు, ఎస్‌హెచ్‌ శ్రీనివాస్‌కు రూ.2లక్షలు



బ్యాటింగ్‌ చేస్తున్న ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్‌

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రికెటర్లు జాక్‌పాట్‌ కొట్టారు. ఆంధ్రా ప్రీమియర్‌ లీగ్‌ (ఏపీఎల్‌) వేలంలో పలువురు క్రికెటర్లు రికార్డు స్థాయి ధర అందిపుచ్చుకున్నారు. గత మూడు సీజన్లలో సిక్కోలు నుంచి ఐదారుగురికి మాత్రమే అవకాశం లభించగా.. 2025లో జరిగే ఈ నాల్గో సీజన్‌లో మాత్రం రికార్డుస్థాయిలో తొమ్మిదిమంది ఆటగాళ్లకు చాన్స్‌ లభించడం విశేషం. అవకాశం లభించినవారిలో ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్‌, త్రిపురాన విజయ్‌, ఎస్‌హెచ్‌ శ్రీనివాస్‌, బెందాళం సాత్విక్‌, నిమ్మల హిమకర్‌, ప్రదీప్‌సాయి, డీవీఎస్‌ సాయిశ్రీరామ్‌, థామస్‌ రామ్‌ కుమార్‌, కశ్యప్‌ ప్రకాష్‌ ఉన్నారు. వీరిలో సీనియర్‌ ఆటగాడు ఎస్‌హెచ్‌ శ్రీనివాస్‌ రూ.2లక్షలు, డీవీఎస్‌ సాయిశ్రీరామ్‌ రూ.80వేలు, బెందాళం సాత్విక్‌ రూ.60వేలు, నిమ్మల హిమకర్‌ రూ.60వేలు, వి.ప్రదీప్‌ సాయి, థామస్‌ రామ్‌కుమార్‌, కె.కష్యప్‌ప్రకాష్‌లు రూ.30వేలు చొప్పున అమ్ముడయ్యారు.

రికార్డు స్థాయిలో 9.25లక్షలు..



జలుమూరుకు చెందిన యువ క్రికెటర్‌ సింగుపురం దుర్గనాగ(ఎస్‌డీఎన్‌వీ) ప్రసాద్‌ రికార్డుస్థాయిలో రూ.9.25లక్షలు పలికాడు. ఇది మూడో అత్యుత్తమ వేలం కావడం విశేషం. వికెట్‌ కీపర్‌ కమ్‌ బ్యాటర్‌గా గత కొన్నాళ్లుగా ఇతడు రాణిస్తున్నాడు. తండ్రి సింగుపురం ఉపేంద్ర కారు డ్రైవర్‌గా పనిచేస్తూ 2019లో అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి రేవతి జలుమూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీసు సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. మొన్నటి ఐపీఎల్‌లో పంజాబ్‌ కింగ్స్‌ నుంచి వచ్చినట్టే వచ్చి ఆఖరినిమిషంలో అవకాశం చేజారిపోయింది.

వైజాగ్‌ లయన్స్‌కు విజయ్‌



జిల్లాకు చెందిన మరో స్టార్‌ క్రికెటర్‌ త్రిపురాన విజయ్‌ను మరోసారి అదృష్టం వరించింది. ఏపీఎల్‌ 4వ సీజన్‌ వేలంలో ఈ యువ ఆల్‌రౌండర్‌ను వైజాగ్‌ లయన్స్‌ రూ. 7.55లక్షలకు కొనుగోలు చేసింది. ఇతడు ఇటీవల ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఎంపికై చక్కటి అనుభవం సంపాదించాడు.

గొప్ప అవకాశం..



జిల్లా క్రికెట్‌ క్రీడాకారులకు లభించిన గొప్ప అవకాశం. చాలా మందికి వేలంలో మంచి ధర లభించింది. చాలెంజింగ్‌గా తీసుకోవాలి.

– పీవైఎస్‌ శాస్త్రి, జిల్లా క్రికెట్‌ సంఘం అధ్యక్షుడు

పాలిథిన్‌ కవరు ఆపేది ఎవరు..?



ఊరి దారుల్లో.. కాలువల్లో.. నదుల్లో.. పల్లెల్లో, పట్టణాల్లో, తీరాల్లో.. ఎక్కడ చూసినా పాలిథినే. మట్టి పొరల నిండా పరచుకుంటున్న ఈ ప్లాస్టిక్‌ వ్యర్థాలు పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. ఊరూవాడా మైకులు పెట్టి చెబుతున్నా, నిషేధాలు విధిస్తున్నా, జరిమానాలు కట్టాలని హెచ్చరిస్తున్నా ఆ కవర్లు వాడనిదే చాలా మందికి రోజు గడవడం లేదు. మరీ ముఖ్యంగా మున్సిపాలిటీల్లో మితిమీరుతున్న ఈ వినియోగం భవిష్యత్‌ను ప్రమాదంలో పడేస్తుంది. –ఆమదాలవలస/ ఇచ్ఛాపురం టౌన్‌/ శ్రీకాకుళం పీఎన్‌ కాలనీ/ కాశీబుగ్గ



- జిల్లాలో విపరీతంగా పెరుగుతున్న ప్లాస్టిక్‌ వినియోగం
- మున్సిపాలిటీల్లో అమలు కాని నిషేధం
- పర్యావరణానికి తీవ్ర హాని

జిల్లాను ప్లాస్టిక్‌ భూతం పట్టి పీడిస్తోంది. 120 మైక్రాన్ల కన్నా తక్కువ పరిమాణం గల పాలిథిన్‌ కవర్లు వినియోగిస్తే ఎన్నో అనర్థాలు కలుగుతాయని ఎంతగా అవగాహన కలిగిస్తున్నా ఉత్పత్తిదారులు, వినియోగదారుల్లో కనీసం మార్పు రావడంలేదు. అలాగే వాటిని నియంత్రించాల్సిన అధికారులు సైతం చోద్యం చూస్తున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేదు.

పేరుకే నిబంధనలు..

జిల్లాలో 75 నుంచి 120 మైక్రాన్ల కంటే తక్కువ పరిమాణం ఉన్న ప్లాస్టిక్‌ కవర్లు ఎక్కడ పడితే అక్కడ ఎలా పడితే అలా విక్రయిస్తున్నారు. వ్యాపారులు సైతం అలాంటి సంచుల్లో సరుకులు ఇచ్చి పంపుతున్నారు. దీన్ని నియంత్రించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు.



జిల్లా కేంద్రంలో కాలువ వద్ద పరిస్థితి

ప్రత్యామ్నాయాలు ఉన్నాయి కదా..

పాలిథిన్‌కు బదులు జూట్‌, క్లాత్‌, కాగితం బ్యాగ్‌లు వినియోగించుకోవచ్చు. కానీ ఆ పని ఎవరూ చేయడం లేదు. ప్రజలు వినియోగించిన ప్లాస్టిక్‌ కవర్ల రోడ్లపై వేయడంతో అవి తిన్న మూగజీవులు సైతం మృత్యువాత పడుతున్నాయి.



ఆమదాలవలస పట్టణశివార్లలో వేసిన ప్లాస్టిక్‌ చెత్త పోగులు

ఆమదాలవలసలో..

ఆమదాలవలస మున్సిపాలిటీలో గల రెండు నెలల్లో 20 మంది దుకాణదారులపై ప్లాస్టిక్‌ వినియోగంపై కేసులు నమోదు చేశారు. వారి వద్ద నుంచి దాదాపు రూ.15వేలు జరిమానా వసూలు చేసినట్లు ఆమదాలవలస మున్సిపల్‌ శానిటరీ కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు.

పలాస-కాశీబుగ్గలో..

మున్సిపాలిటీలో ఉన్న 31వార్డుల్లో ఒక్క చోట కూడా ప్లాస్టిక్‌ నిషేధం అమలు కావడం లేదు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 16 సచివాలయాల పరిధిలో 31వారుల్లో గత నాలుగు నెలలుగా ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించి సుమారు 40 కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.20 వేలు వసూలు చేసినట్లు అధికారులు తెలిపారు.



పాలిథిన్‌ కవర్లలో కూరగాయలు



ఇచ్ఛాపురంలో ఇలా..

ఇచ్ఛాపురంలో 2025 ఏప్రిల్‌ నుంచి ఇప్పటి వరకు 11 కేసులు నమోదు చేసి రూ.5300 వసూలు చేశామని మున్సిపల్‌ కమిషనర్‌ ఎన్‌. రమేష్‌ తెలిపారు. వారి వద్ద నుంచి 10.25 కిలోల ప్లాస్టిక్‌ను సీజ్‌ చేశామన్నారు.

నివారణకు చర్యలు తీసుకుంటున్నాం

గతంలో ప్లాస్టిక్‌ నివారించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. ప్రస్తుతం మళ్లీ పాలిథిన్‌ కవర్లు వినియోగిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. త్వరలోనే స్పెషల్‌డ్రైవ్‌ ఏర్పాటు చేసి దుకాణదారులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తాం.

– బాలకృష్ణ, మున్సిపల్‌ శానిటరీ సెక్రటరీ, ఆమదాలవలస మున్సిపాలిటీ

ఆరోగ్యానికే ప్రమాదం



ప్లాస్టిక్‌ సంచుల వాడకం అందరి ఆరోగ్యానికి ప్రమాదకరం. మనుషులు రోగాల బారిన పడుతుండగా, జంతువులు ప్లాస్టిక్‌ సంచులు తిని చనిపోతున్నాయి.

– పాక తులసీదాస్‌, రోటరీ క్లబ్‌ వైస్‌ చైర్మన్‌, విశ్వహిందూపరిషత్‌, కవిటి

జిల్లా కేంద్రంలో..

శ్రీకాకుళం మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో ఈ ఏడాది కాలంలో హోల్‌సేల్‌ ప్లాస్టిక్‌ అమ్మకాలు చేసే 5 షాపుల నుంచి ఒక్కో షాపు నుంచి రూ.20వేలు చొప్పు న రూ.లక్ష అపరాధ రుసుం వసూలు చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పండ్లు, కూరగాయలు, బడ్డీలు వంటి వారి నుంచి సు మారు రూ.10వేలు వరకు వసూలు చేసినట్లు చెబుతున్నారు. వాస్తవానికి సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ నిషేధ కార్యక్రమం ప్రతి రోజూ చేయాల్సి ఉన్నప్పటికీ కేవలం నెలకోసారి డ్రైవ్‌ నిర్వహించి తూతూ మంత్రంగా వదిలేస్తున్నారని విమర్శ లు వినిపిస్తున్నాయి. ఎక్కడా ఆకస్మిక తనిఖీలు కానరావడం లేదు.

చర్యలు చేపడుతున్నాం



సింగిల్‌ యూజ్‌ ప్లాస్టిక్‌ నిషేధానికి డ్రైవ్‌లు నిర్వహిస్తున్నాం. ప్రజలంతా సహకరిస్తేనే సాధ్యపడుతుంది. మార్కెట్‌కి వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరు గుడ్డ సంచులు, స్టీల్‌ బాక్స్‌లు, సంచులు తీసుకెళ్లడం మంచిది. – పి.వి.వి.డి ప్రసాదరావు, కార్పొరేషన్‌ కమిషనర్‌, శ్రీకాకుళం

ప్రజారోగ్యాన్ని కాపాడాలి



పాలథిన్‌ వినియోగం అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అటు మున్సిపల్‌ అధికారులు, ఇటు ప్రజలు, ప్రజా సంఘాలు అందరిపైనా ఉంది. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. – బొడ్డేపల్లి మోహన్‌రావు, న్యాయవాది, ఆమదాలవలస

క్లుప్తంగా

పాముకాటుతో వృద్ధురాలి మృతి

టెక్కలి రూరల్: సీతాపురంలో మంగళవారం పాముకాటుకు గురై అదే గ్రామానికి చెందిన మూల నారాయణమ్మ (75) అనే వృద్ధురాలు మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణమ్మ తన కుమారుడు తవుడుతో కలిసి ఉంటోంది. ఇతను చిన్నబజార్‌లో టైలరింగ్ షాపులో పనిచేస్తున్నాడు. మంగళవారం తవుడు షాపుకు వెళ్లిపోయిన తర్వాత వృద్ధురాలు బయటకు వెళ్లేందుకని చెప్పుల స్టాండ్ వద్దకు వెళ్లింది. చెప్పులను తీస్తుండగా అప్పటికే అందులో ఉన్న పాము కాటువేసింది. చూపు సరిగా లేకపోవడంతో నాగుపాము అని గుర్తించలేకపోయింది. కొంత సేపటికి తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పాముకరిచి చాలా సమయం కావడంతో పరిస్థితి విషమించి మృతిచెందింది.

ఏఐ పోటీల విజేతగా ఇచ్ఛాపురం ఆదర్శ పాఠశాల జట్టు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

ఇచ్ఛాపురం: అమెజాన్ కంపెనీ హ్యాక్ టూ ఫ్యూచర్ పేరుతో నిర్వహించిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) జోనల్ స్థాయిలో పోటీల్లో ఇచ్ఛాపురం ఆదర్శ పాఠశాల జట్టు ప్రథమస్థానం సాధించిందని ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు తెలిపారు. విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన పి.దీపక్(10వ తరగతి), జాహ్నవి(9వ తరగతి), హేమలత(8వ తరగతి) బృందం ప్రథమ స్థానం సాధించి బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులను ఐటీ ట్రైనర్ ఉమాశంకర్, కుమార్‌స్వామి అభినందించారు.

పాన్‌షాప్ వ్యాపారిపై దాడి


గాయపడిన రాకేష్

నరసన్నపేట: స్థానిక పెద్దపేట కూడలి వద్ద పాన్ షాపు యజమాని కోరాడ రాకేష్‌పై ముగ్గురు యువకులు గంజాయి మత్తులో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో రాకేష్‌కు గాయాలు కావడంతో నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ముగ్గురు యువకులు వచ్చి అకారణంగా దాడికి దిగారని, షాపును ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా పట్టణ వ్యాపారులపై ఈ విధంగా ఎప్పటికప్పుడు దాడులు జరుగుతుండటంతో వ్యాపార వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడిని పట్టణ వర్తక సంఘం, కళింగ కోమట్లు సంఘం తీవ్రంగా ఖండించాయి. ఇటువంటి భౌతికదాడులకు ఎవరు పాల్పడినా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య ఒక ప్రకటన విడుదల చేశారు. దాడిని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కేసీహెచ్‌బీ గుప్త, పొట్నూరు ప్రసాద్ ప్రకటనలు విడుదల చేశారు.

తండ్రికి తలకొరివిపెట్టిన తనయ


అంత్యక్రియలు నిర్వహిస్తున్న లావణ్య

హిరమండలం: తండ్రికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది ఆ కుమార్తె. ఎల్‌ఎన్‌పేట మండలం శ్యామలాపురం గ్రామానికి చెందిన ఇప్పిలి జగదీష్ (49) కోళ్లఫారం నడుపుతున్నారు. కోళ్లఫారంలో ఉండగా ఆదివారం రాత్రి పాముకాటు వేయడంతో మృతిచెందారు. ఈయన కుమారుడు రెండేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమార్తె లావణ్య లండన్‌లో ఉంటోంది. తండ్రి మరణంతో హుటాహుటిన బయలుదేరి స్వగ్రామానికి మంగళవారం చేరుకుంది. అన్నీ తానై అంత్యక్రియలు పూర్తి చేసింది.

కొనసాగుతున్న వైద్యశిబిరం


సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

పాతపట్నం: పాతపట్నం ప్రహరాజపాలెంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం కొనసాగుతోంది. 28 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యారని గంగువాడ, చాపర పీహెచ్‌సీ వైద్యులు పూర్ణిమ, లక్ష్మి తెలిపారు. మంగళవారం సాయంత్రం నాటికి పది మందికి జ్వరాలు తగ్గాయని, పాఠశాలలో 11 మందికి వైద్యం అందిస్తున్నామన్నారు. పాతపట్నం సీహెచ్‌సీలో ఐదుగురు విద్యార్థినులు చికిత్స పొందుతున్నారని, ఇద్దరికి జ్వరం తగ్గడంతో డిశ్చార్జి చేశామని సూపరింటెండెంట్ జి.వేణుగోపాల్ తెలిపారు. వైద్య శిబిరాన్ని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ పరిశీలించారు.

విపత్తుల వేళ.. జాగ్రత్తలు ఇలా..




రసాయనాన్ని అన్‌లోడ్ చేస్తున్న టెక్నికల్ నిపుణులు


కార్మికుడికి ప్రథమ చికిత్స చేయిస్తున్న దృశ్యం


వాటర్ స్ప్రే చేస్తున్న భద్రతా నిపుణులు

పైడిభీమవరం పారిశ్రామికవాడలోని మెస్సర్స్ ఆంధ్రా ఆర్గానిక్ లిమిటెడ్ పరిశ్రమలో రసాయనిక ప్రమాదాల నివారణపై మంగళవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అమ్మోనియా ట్యాంకర్ దించినప్పుడు వాల్వ్ విరిగిపోవడం, అకస్మాత్తుగా గ్యాస్ లీకేజీ సంభవించడం, ఉద్యోగులు గాయపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ కళ్లకు కట్టినట్టు చూపించారు. కార్యక్రమంలో పరిశ్రమ జనరల్ మేనేజర్ ఎం.కృష్ణయ్య, ఈహెచ్‌ఎస్ మేనేజర్ ఎన్.రాఘవరెడ్డి, ఉద్యోగులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు. - రణస్థలం

బరువెక్కిన బ్యాగు

- నిబంధనలకు విరుద్ధంగా బడి సంచి బరువు
- పుస్తకాలు తీసుకెళ్లలేక అనారోగ్యం బారిన చిన్నారులు
- పట్టించుకోని అధికారులు

శ్రీకాకుళం :

జిల్లాలోని విద్యార్థులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక బరువుతో కూడిన స్కూల్ బ్యాగులను మోసుకువెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉంటోంది. బడి బ్యాగు మోయలేక వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో ఐదేళ్లు నిండిన పిల్లలకు మాత్రమే బడుల్లో చేర్పించేవారు. ఆధునిక యుగంలో నర్సరీ, కేజీ, యూకేజీ అంటూ క్లాసులు పెట్టడంతో మూడేళ్లు నిండిన పిల్లలను సైతం బడుల్లో చేర్పించేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒకటో తరగతి విద్యార్థులకు 750 గ్రాములు, రెండో తరగతి విద్యార్థులకు రెండు కేజీలు, మూడు నాలుగు తరగతుల చిన్నారులకు మూడు కేజీలు, 5వ తరగతి వారికి నాలుగు కేజీలు, ఆరో తరగతి వారు ఆరు కేజీలు, ఏడో తరగతి వారికి 8 కేజీలు, 8వ తరగతి వారికి 10 కేజీలు, 9, 10 తరగతుల వారికి 12 కేజీల బరువున్న స్కూల్ బ్యాగులు మాత్రమే తీసుకెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఇవి ఎక్కడా అమలు కావడం లేదు.

ఆదాయం కోసం..

కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు తమ ఆదాయం కోసం టెక్స్ట్‌బుక్‌లు, నోట్ పుస్తకాలు, హోంవర్క్ పుస్తకాలు అంటూ విపరీతంగా బరువులు పెంచేస్తున్నారు. ప్రస్తుతం ఎల్‌కేజీ, యూకేజీ వారే రెండు కేజీలకు పైబడిన పుస్తకాలు తీసుకువెళుతుండగా మిగిలిన తరగతుల విద్యార్థుల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 8 9 10 తరగతి వారు 15 కేజీలకు పైబడి బరువును మోసుకువెళుతున్నారు. చాలా పాఠశాలల్లో రెండు మూడు అంతస్తులు ఉండటంతో అంతేసి బరువును మోసుకొని మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి.


అధిక బరువున్న బ్యాగుతో చిన్నారి అవస్థలు

విద్యార్థులకు పాట్లు..

విద్యార్థులు చిన్న వయసులోనే నడుము, మోకాళ్ల నొప్పులతోపాటు మెడ నొప్పులు సయాటికా వంటి ఎన్నో రకాల ఎముకలకు సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారు. పిల్లల బరువులో 10 నుంచి 15 శాతం మాత్రమే బ్యాగు బరువు ఉండేలా చూడాలని విద్యావేత్తలు, వైద్యులు సూచిస్తున్నప్పటికీ అవి అమలు కావడం లేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం కూడా నిర్ణీత బరువునే పాఠశాలలు యాజమాన్యాలు అమలు చేయాల్సి ఉంటుంది. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యాహక్కు చట్టానికి కూడా తూట్లు పడుతున్నాయి. కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు తమ ఆదాయాన్ని చూసుకుంటున్నాయే తప్ప విద్యార్థుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదు. ఇటువంటి వాటిని నియంత్రించాల్సిన విద్య శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా నిపుణులు వైద్యులు సూచించడంతోపాటు విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలయ్యేలా బ్యాగు బరువును తగ్గించేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పలాసలో కి‘లేడి’ అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

కాశీబుగ్గ: తోటి ప్రయాణికులతో మాట కలుపుతూ చాకచక్యంగా బ్యాగులు కొట్టేస్తున్న మహిళా దొంగను పలాసలో పోలీసులు అరెస్టు చేశారు. కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ వెంకట అప్పారావు మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. అనకాపల్లికి చెందిన పారుపల్లి దుర్గా(40) ఆటోలు, బస్సుల్లో ప్రయాణిస్తూ దొంగతనాలు చేస్తుండేది. చోరీ కేసుల్లో పలుమార్లు జైలుశిక్ష అనుభవించింది. అయినా మార్పు రాలేదు. ఈ క్రమంలో జూన్ 6న గార మండలం దీపావళి గ్రామానికి చెందిన నల్ల రోహిణి అనే మహిళ పలాసకు బస్సులో బయలుదేరగా దుర్గా చాకచక్యంగా బ్యాగు కొట్టేసింది. అందులో నాలుగున్నర తులాల చైన్, తులంన్నర నెక్లెస్ పోయిందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు పాత నేరస్తురాలు దుర్గాపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో దుర్గా మంగళవారం శ్రీకాకుళంలో బస్సు ఎక్కి పలాస వస్తుండగా కాశీబుగ్గ బస్టాప్‌లో అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా ఆరు తులాల బంగారు ఆభరణాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేశారు. ఈమెపై గతంలో శ్రీకాకుళం, గాజువాక, అనకాపల్లి, చోడవరం, నెల్లిమర్లలో చోరీ కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ సూర్యనారాయణ, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం డిమాండ్ చేశారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కలెక్టర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ. 6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యార్థులు సమస్యలు పెరిగాయన్నారు. పాస్ సర్టిఫికెట్లను కళాశాల యాజమాన్యాలు అందించకపోవడంతో చాలామంది యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలల నిర్వహణకు సైతం యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయని చెప్పారు. నిరసన కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి, జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ, సంతోష్ కుమార్, నందు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో ఆధ్యాత్మిక శోభ

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవ పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారికి మొక్కులు చెల్లించేందుకు మహిళలు భారీగా తరలిరావడంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పలు వీధుల్లో ఆషాఢమాస ఆవేటి వారాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగర వాసులు తమ ఇళ్ల నుంచి బయలుదేరి ఘటాలను తీసుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా యువకులు నృత్యాలతో, బాణసంచాకాల్పులతో సందడి చేశారు. ఆషాఢ మాసం మొదటి పౌర్ణమి తరువాత తొలి మంగళవారం ఆవేటి పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. పాతపట్నం సీఐ వి.రామారావు పర్యవేక్షణలో పాతపట్నం, మెళియాపుట్టి ఎస్‌ఐలు లావణ్య, రమేష్‌బాబు పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


గజనెయ్యి ముద్దతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మహాకవీ.. మన్నించు


ప్రియాగ్రహారంలో గరిమెళ్ల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న స్థానికులు, కమిటీ సభ్యులు

పోలాకి: ‘మా కొద్దీ తెల్లదొరతనం... అయ్యా కుక్కలతో పోరాడి కూడు తింటామండి, మా కొద్దీ తెల్లదొరతనం’ అంటూ జాతీయోద్యమంలో కీలక పాత్ర పోషించిన గరిమెళ్ల సత్యనారాయణ పేరును జిల్లా ఎన్నడూ మరిచిపోదు. కానీ ఆ మహాకవి జయంతి నాడు కనీసం నివాళి కూడా అర్పించలేదు కూటమి పాలకులు. ఆయన స్వగ్రామం ప్రియాగ్రహారంలో ఆయన పేరుతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల ఉన్నాయి. పాఠశాల ప్రాంగణంలో నాటి సభాపతి జి.శ్రీపాదరావు స్థాపించిన విగ్రహం కూడా ఉంది. ఏటా గరిమెళ్ల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను స్థానికంగా కొంతమంది కలసి గరిమెళ్ల జయంత్యుత్సవ కమిటీగా ఏర్పడి చేపడుతున్నారు. పక్కనే ఉండే అచ్చెన్నాయుడు సైతం ఈ రోజున ప్రియాగ్రహారం వైపు కన్నెత్తి చూడకపోవటం, స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సైతం హాజరుకాకపోవటం బాధాకరమని స్థానికులు అన్నారు.

సింగుపురంలో చైన్‌స్నాచింగ్

శ్రీకాకుళం రూరల్: సింగుపురం లో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని ఇద్దరు దుండగులు చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. రూరల్ ఎస్‌ఐ ఇచ్చిన వివరాల మేరకు.. సింగుపురం గ్రామానికి చెందిన చలుమూరి వెంకటకుమారి స్థానిక ఏటీఎం వద్ద డబ్బులు తీసుకొని తిరిగి ఇంటికి వస్తుండగా.. ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్క్‌లు తొడిగి నంబర్ ప్లేట్‌లేని బైక్‌పై వచ్చి మూడు తులాల బంగారు తాడును తెంచేసి పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గంజాయి ముఠా అరెస్టు


పట్టుబడిన నిందితులతో పోలీసులు

కాశీబుగ్గ: బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన గంజాయి ముఠాను కాశీబుగ్గ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం వైశాలి జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ఆశాదేవి, అనితాదేవి, ఉషాదేవిలు పాట్నాలో ఓ అపార్ట్‌మెంట్‌లో వంట మనుషులుగా పనిచేస్తున్నారు. వీరికి పింకీ అనే మహిళ ద్వారా శుభరాత్, అంబాజీ గాడ్‌లు పరిచయమయ్యారు. సులభంగా సొమ్ము సంపాదించాలనే ఆశతో ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి బీహార్, కేరళ రాష్ట్రాలకు తరలించేందుకు వ్యూహరచన చేశారు. ఈ క్రమంలో పలాస రైల్వే స్టేషన్‌కు చేరుకుని రైలు ఎక్కే ప్రయత్నంలో కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 42 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి పలాస కోర్టుకు తరలించామని చెప్పారు. సమావేశంలో సీఐ సూర్యనారాయణ, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం


సంఘటనా స్థలం వద్ద మృత దేహాలు

- ట్రాక్టర్ బోల్తా పడి అన్నాచెల్లెల్లు మృతి
- ప్రమాదం నుంచి బయటపడిన మరో నలుగురు
- కామేశ్వరిపేట సమీపంలో ప్రమాదం
- లుకలాంలో విషాదఛాయలు

నరసన్నపేట: రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెల్లు మృత్యువాతపడిన విషాద ఘటన నరసన్నపేట మండలం కామేశ్వరిపేట సమీపంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

నరసన్నపేట మండలం లుకలాం గ్రామానికి చెందిన గొద్దు ఆదినారాయణ(42), చోడి లక్ష్మి (35), జి.బంగారమ్మ, లంక శ్రీనివాస్, గొద్దు అశోక్‌కుమార్‌లు ఓ కర్రల వ్యాపారి వద్ద కూలీలుగా పనిచేస్తున్నారు. వీరిలో ఆదినారాయణ, లక్ష్మి అన్నాచెల్లెలు. పరిసర గ్రామాలకు వెళ్లి కర్రలు కొట్టడం, వాటిని ట్రాక్టర్‌పై లోడ్ చేసి తరలించడం వీరి దినచర్య. దీనిలో భాగంగా మంగళవారం స్వామి అనే వ్యక్తి ట్రాక్టర్‌పై కామేశ్వరిపేటకు బయలుదేరారు. కొల్లవానిపేట రైల్వే గేటు దాటి కొంత దూరం వెళ్లేసరికి టైర్ పంక్చర్ అయింది. వేగంగా వెళ్తుండటంతో ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న లోతైన ప్రదేశంలో తుప్పల్లోపడింది. ట్రాక్టర్, ఇంజన్ చెరోవైపు పడిపోయాయి. ట్రాక్టర్ కింద ఆదినారాయణ, లక్ష్మి ఇరుక్కుపోయారు. మిగిలిన వారు తేరుకుని వీరిద్దరినీ బయటకు తీసి అంబులెన్స్‌కు ఫోను చేయగా కొద్దిసేపటికే మరణించారు.

కూలి పనులు చేస్తూ..

విజయనగరంలోని నెల్లిమర్ల ప్రాంతానికి చెందిన ఆదినారాయణ, లక్ష్మి లుకలాం వచ్చి స్థిరపడ్డారు. చిన్నప్పటి నుంచీ ఏ పనికి వెళ్లినా అన్నాచెల్లెల్లు కలిసే వెళ్లేవారు. మృత్యువులోనూ అన్నాచెల్లెల్లు బంధం వీడలేదంటూ గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. లక్ష్మికి భర్త చిన్నారావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదినారాయణకు భార్య గున్నమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నరసన్నపేట ఇన్‌చార్జి ఎస్‌ఐ, పోలాకి ఎస్‌ఐ రంజిత్ ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై సర్పంచ్ శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు చింతల వెంకటరమణ, చింతల సత్యం, కామేశ్వరపేటకు చెందిన జోగినాయుడు తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీనిచ్చారు.


ఆదినారాయణ(ఫైల్)


లక్ష్మి(ఫైల్)


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దేవాదిలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి
- ఇటీవలే క్యాన్సర్‌తో మృతి చెందిన భార్య
- అనాథలైన పిల్లలు


కృష్ణ(ఫైల్)


అనాథలుగా మిగిలిన మోహిని, యోగిత

నరసన్నపేట: దేవాది ఫ్లై ఓవర్ వంతెన వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన బండి కృష్ణ (38) మృతి చెందారు. మడపాం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా అదుపు తప్పి ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న నరసన్నపేట పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తండ్రి కృష్ణ మృతి చెందడంతో కుమార్తెలు మోహిని, యోగితలు అనాథలయ్యారు. తల్లి స్వాతి ఇటీవలే క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. దీంతో కృష్ణ అన్నీతానై పిల్లలను చూస్తున్నాడు. ఇంతలో మృత్యువు వెంటాడటంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కృష్ణ చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. దేవాది వద్ద టైర్ పంక్చర్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. భార్యకు క్యాన్సర్ సోకడంతో ఆమె చికిత్స నిమిత్తం లక్షల రూపాయలు అప్పులు చేశాడు. అయినా కాపాడలేక పోయాడు. కృష్ణ పెద్ద కుమార్తె మోహిని మాకివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 8వ తరగతి, రెండో కుమార్తె యోగిత ఆరో తరగతి చదువుతోంది. ప్రస్తుతానికి ఇదే గ్రామంలో ఉన్న కృష్ణ అత్తమామలు ధర్మాన నీలం, సాయమ్మ వద్ద ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కుక్కల దాడిలో చిన్నారులకు గాయాలు


గాయపడిన షేక్ ఉస్మాన్

ఇచ్ఛాపురం రూరల్: ఎం.తోటూరుకు చెందిన షేక్ ఉస్మాన్ అనే బాలుడు స్నేహితులతో ఆడుకుంటుండగా పెంపుడు కుక్క బాలుడిపై దాడి చేసింది. ఈ ఘటనలో బాలుడి కన్ను, తలపై గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు. అదే విధంగా, ఇచ్ఛాపురం పట్టణంలో ఎ.ప్రణతీ అనే బాలికపై వీధి కుక్క దాడి చేసి గాయపరచడంతో ఆసుపత్రిలో చికిత్స అందజేశారు. ఇటీవల కుక్కల దాడులు ఎక్కువయ్యాయని, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఈ–డివిజనల్ మేనేజర్ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నీలాపురంలో జ్వరాలు



టెక్కలి రూరల్: మండలంలోని గూడేం పంచాయతీ పరిధి సన్యాసి నీలాపురంలో జ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క ఇంటిలో జ్వర బాధితులు కనిపిస్తున్నారు. కొందరు టెక్కలి ఆస్పత్రికి వెళ్తుండగా మరికొంద రు ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు సరిగా జరగకపోవడంతో పాటు గ్రామంలోని తాగునీటి బావిలో క్లోరినేషన్ చెయ్యక పోవడం తదితర కారణాలు వల్ల గ్రామంలో జ్వరాలు వస్తున్నాయని గ్రా మంలో ప్రజలు వాపోతున్నారు.